# జీవితంలోని ఓ ఘట్టం! ★

(సవ్యసాచి)

వెన్నెల రాత్రులు. భోజనం చేసి, నేనూ, రామం డాబామీద కుర్చీలల్లో కూర్చునివున్నాం. చిరు మేఘాలు ఆకాశంలో పరిగెడుతున్నాయి పల్చగా. దూరాన చెట్లమీద పిట్టలు కబుర్లు చెప్పుకుంటున్నాయి. రామం ఆకాశంవైపు చూస్తున్నాడు. ప్రకృతిలో, సౌందర్యోపాసనలో మునిగితేలుతోన్న 'ఆర్టిస్ట్' అతను. నేను రామం ముఖంలోకి చూశాను. అతని పెదవులమీద చిరునవ్వు మెరిసింది.

"చూడూ ఆకాశంవైపు" అన్నాడు.

నాదృష్టిని అటుపక్క తిప్పాను. ఒకపల్చని నీలిమబ్బు చంద్రబింబాన్నావరించి వున్నది. మబ్బుల్లో చందమామ అందంగా అవుపిస్తున్నాడు. మళ్ళీ రామం ముఖంలోకి చూశాను.

రెండు నీలిపిట్టలు మాకు ఎదురుగావున్న పిట్టగోడమీదవాలి ముద్దులు పెట్టుకుంటున్నాయి.

"చూడు రామం ఆపిట్టలు! తొలిముద్దు మాధుర్యాన్ని అనుభవించిన ప్రేమికుల్లాగ ఎంతసిగ్గుతో, శృంగారంగా నిలుచున్నాయో!" అన్నాను. చప్పున రామం ముఖంలోని భావాలు మారాయి.

"ఆఁ! తొలిముద్దా......" అని అస్పష్టంగా అన్నాడు. ఆశ్చర్యపోయాను.

"రామం! అంతటిలోనే నీ ముఖభావాలను మార్చేశావేం?" అన్నాను. మౌనం వహించాడు. ఏదోవిచారమో, స్మరణో అతన్ని బాధిస్తోందని తెలుసుకున్నాను. ఆఉదంతం తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది మనస్సులో.

"తొలిముద్దు అనగానే వులిక్కిపడ్డావు. ఆసమయంలో ఏదన్నా సంభవించిందా రామం?" అని అడిగాను ఆపుకోలేక. నాకళ్ళల్లోకి వొక్కసారి చూసి ముఖం తిప్పుకున్నాడు. చెప్పేందుకు ఇష్టం లేదేమో అని భావించాను. అతని నిశ్శబ్దాన్ని చూసి తప్పకుండా తెలుసుకోవాలన్న పట్టుదల ఎక్కువయింది. కానీ, ఆవృత్తాంతాన్ని స్మరణకుతెప్పించి, అతని ద్వారానే చెప్పిస్తే ఇంకా ఏం బాధ పడతాడో అని దిగులేసింది.

"నీకు కష్టంగావుంటే చెప్పొద్దులే రామం" అన్నాను.

"కష్టానికేమీ లేదు కృష్ణా. కానీ ఆవుదంతం జ్ఞప్తికివస్తే, ఏవో సముద్రతరంగాలూ, తుపానూ లేస్తుంది నాహృదయంలో. నువ్వు నాహృదయానికి హృదయమై తిరుగుతున్నావు. నారహస్యాలన్నీ నీకు చెప్పాను కానీ, ఈవొక్కసంగతి నీకు తెలుపకుండా దాచాను. ఇప్పుడు బయటపెడుతున్నాను- విను" అన్నాడు. బరువుగా నిట్టూర్పువిడుస్తో.

సిగరెట్టు ముట్టించి వింటున్నాను.

"మా మామయ్య, తన వొక్కకుమార్తె బాల్యచేష్టలన్నా చూసి ఆనందించకుండా శాశ్వతంగా ఆమెను విడిచివెళ్ళిపోయాడు. పిల్లలు పుట్టిన తరవాత, స్త్రీకి, భర్తమీద ప్రేమ తగ్గిపోయి అది పిల్లలవైపు ప్రసరిస్తుందంటారు. కానీ, మాఅత్త అది అబద్ధమని నిరూపించేందుకే కాబోలు, భర్తని కలుసుకోవాలని అతని మార్గాన్ననుసరించింది. ఇంక రాధ దిక్కులేని దీనురాలు అయిపోయింది. ఆపిల్లకెవ్వరూ ఆధారం లేకపోవడంచూసి మానాన్నగారు తనదగ్గర పెట్టుకున్నారు. నాతో సహా

వంగా రాధను పెంచుకుంటోవొచ్చారు. మమ్మల్నిద్దరినీ చెరియొక తొడమీద కూచోపెట్టుకుని, మాకు కథలుచెప్పి నవ్వించేవారు రాజూ, రాజు పెళ్ళాం కథలు మానాన్నగారు చెబుతోంటే, నన్ను నేను రాజుగా భావించుకుని, నాభావనా ప్రపంచానికి రాధను రాణీగా చేశేవాణ్ణి. ఏవో అర్థంకాని ఆలోచనలు నాలో వుదుకెత్తేవి. అప్పుడు మమ్మల్నిద్దరినీ చూసిన మానాన్నగారి హృదయంలో, ఏవూహాలు కలిగాయో, నాకు అప్పుడు గ్రహించుకునే శక్తిలేకపోయింది. తరవాత్తరవాత అర్థం చేసుకోగలిగాను.

ఒక్క కంచంలోనే తింటూ, వొక్కమంచం మీదే పడుకునేవాళ్ళం మేమిద్దరమూను. రాధ నన్ను నోరార 'బావా' అని పిలుస్తోంటే ఆమెనోటి నుండి రత్నాలన్నీ వొలికేవి. తనుకూడా అన్నది, నేను 'రాధా' అని పిల్చినప్పటి మాధుర్యం మరొకరి పిలుపులో లేదని. మాస్వైరవిహారాలకి ఎవ్వరూ అడ్డుపెట్టేవారుకారు. దీపావళీ వొచ్చిందంటే మాఇద్దరి హృదయాలు సంతోషంతో నిండిపోయేవి. బాణాసంచా సరదాగా కాల్చేవాళ్ళం. నన్ను వొదిలి రాధ, ఆమెనువొదిలి నేను, వుండలేకపోయే వాళ్ళం. అప్పుడు రాధకి పన్నెండుసంవత్సరాల వయస్సు. నాకు పద్నాలుగేళ్ళువుంటాయి. ఆమె వయస్సుతోపాటు సౌందర్యంకూడా అభివృద్ధిపొందుతోంది, నాకళ్ళకి ఆమె వొక దేవతలాగ అవుపించేది.

ఆనాడురాత్రి మేమిద్దరం భోజనంచేసి పడుకునేందుకు మేడమీదికి వొచ్చాం. మా అమ్మ వొంటింట్లో ఏవేవో పనులు చేసుకుంటోంది. నాన్నగారు స్కూలుకుర్రాళ్ళ 'కాంపోజిషన్' పుస్తకాలు దిద్దుకుంటున్నారు. చెల్లెమ్మ వుయ్యాలలో పడుకుని నిద్రపోతోంది. డాబామీద వెన్నెట్లో మంచంమీద నేనూ రాధ కూర్చున్నాం. చంద్రుడు చల్లని కిరణాలు మాయిద్దరిమీద ప్రసరిస్తున్నాడు. వెన్నెట్లో ఆమె సౌందర్యం అనేకరెట్లు అభివృద్ధి పొందింది. ఆసౌందర్యం అతీతమనిపించింది నా నేత్రాలకి, ఆమె విశాలమైన నేత్రాలలో నీలి ఆకాశం ప్రతిఫలిస్తోంది.

"రాధా!" అని పిల్చాను.

"ఏం బావా?" అన్నది రాధ.

"ఇప్పుడు నీముఖం వికసించిన కలువపూవల్లే వున్నదిరాధా" అన్నాను. ఒక్కసారిగా నాలో కవిత్వం విజృంభించింది. నాభావానికి నేనే ఆశ్చర్యపోయాను.

"చంద్రకిరణాల చల్లదనం నీచూపుల్లో వున్నది బావా!" అన్నదిరాధ. నాలో కలిగిన భావాలే ఆమెలోనూ కలిగాయని ఆశ్చర్యపోయాను. ఛప్పున ఆమెను నాచేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాను. ఒకటి......రెండు......ఎన్నో!

"బావా! అత్త, మామయ్య నన్ను ముద్దుపెట్టుకుంటే చల్లగావుంటుంది. నీముద్దు వెచ్చగావున్నదేం?" అన్నది అమాయకంగా.

"బావామరదళ్ళ ముద్దులిట్లానేవుంటాయి" అన్నాను. తెలిసీతెలియని లోకజ్ఞానంతో అర్థంలేని చిరునవ్వునవ్వింది. దుప్పటి కప్పుకుని ఇద్దరం వొక్కమంచంమీదే పడుకున్నాం. పైన దుప్పటి చల్లగావున్నా, లోపల మాశరీరాలు వెచ్చగానే వున్నాయి. తెల్లవారగానే నేనులేచి చూసేసరికి రాధముఖం నాముఖానికి దగ్గరగానేవున్నది. రాత్రల్లా ఇట్లానే పడుకున్నామనుకుంటే, ఏదో చెప్పలేని ఆనందాన్ననుభవించాను.

రాధ రజస్వలా అయిన దగ్గరనుంచీ మునుపటిలాగ నాదగ్గరకు రావడం తగ్గించింది. రేరే మా అమ్మ దగ్గర పడుకునేది. కానీ మేమిద్దరం మాకు దొరికిన అవకాశాలను వృథాపోనియ్యక చనువుగా మాట్లాడుకునేవాళ్ళం. ఆమె చూపుల్లో నూతన

సంగా ప్రవేశించిన 'సిగ్గు' ఎంతో ఆనందమనిపించింది నాకు. ఆమె నాతో నవ్వుతూ, మాటాడుతోవుంటే ఆకలి, స్కూలూ మర్చిపోయేవాణ్ణి. మేమిద్దరం వొంటరిగా కలుసుకున్నప్పుడు రెండు నిమిషాలకన్నా ఎక్కువసేపు నిలబడేదికాదు. ఆ రెండు నిమిషాలలో ఎంతో ప్రేమగా, వొయ్యారమొలికిస్తూ మాటాడేది. ఆమె నాకళ్ళకెప్పుడూ అవుపించాలని, నాతో మాటాడాలని మనస్సు తహతహ పడేది. అందుకు పనిలేనప్పుడుకూడా 'రాధా' అని పిల్చేవాణ్ణి. ఓసారి రాధఅన్నది "నన్నెందుకు బావా ఎప్పుడూ పిలుస్తోవుంటావు ?" అని.

"నువ్వు నాకళ్ళ కవుపించకపోతే అదో మాదిరిగా వుంటుంది రాధా. నీవియోగాన్ని నేను సహించలేను" అన్నాను.

కొంటెగా నవ్వుతో తుర్రున పారిపోయింది.

రెండురోజులనుంచి జ్వరంతో బాధపడుతున్నది రాధ. ఆమెకు జ్వరంవొస్తే నాకొచ్చినట్టు బాధపడ్డాను. సాపాటాలూ, స్కూలూ మానుకుని, ఆమెదగ్గర కూచుని, మందులు ఇస్తో, కబుర్లు చెబుతో ఆమెకు సంతోషాన్ని కలిగించేవాణ్ణి. రాధ తనబాధనంతటినీ మర్చిపోయి నాలాలనలో నిద్రపోయేది.

జ్వరం తగ్గుతోన్న రోజుల్లో వోసారి రాధ నన్ను పిలిచింది. దగ్గరకు వెళ్ళాను.

"నాకోసం నువ్వు స్కూలుకుకూడా వెళ్ళడం మానుకుంటున్నావు. నేనంటే నీకెందుకంత ప్రేమ బావా ?" అన్నది రాధ.

"నీకోసం నాప్రాణమన్నా సంతోషంతో విడిచిపెట్టగలను రాధా" అన్నాను. అమాయకంగా నాకళ్ళల్లోకి చూసింది. బరువుగా కళ్ళు మూసుకున్నది.

మరి వారంరోజుల్లో రాధ ఆరోగ్యవంతురాలయింది.

"నువ్వుండడంచాతే నాకారోగ్యం కలిగింది. లేకపోతే నేనేమయ్యేదాన్నో కదా బావా" అని రాధ అంటోవుంటే నామీద ఆమెకున్న ప్రేమకి నేను ఏమిస్తే ఆఅమాయక హృదయానికి ఆనందం కలుగుతుంది ? నాహృదయాన్ని ఆమెకు అంతకు ముందే అర్పించివేశాను.

పరీక్షాఫలితాలు తెలిశాయి. 'ఇంటర్మీడియేట్' చదివేందుకు విశాఖపట్నం వెళ్ళమంటున్నారు నాన్నగారు. రాధను వొదిలి వెళ్ళడమంటే కష్టమనిపించింది.

"రాధా ! 'ఇంటర్' చదివేందుకు విశాఖపట్నం వెళ్ళమంటున్నారు. కానీ నిన్నువొదిలి వెళ్ళడమంటే కష్టమనిపిస్తోంది. ఏం చెయ్యను రాధా,!" అన్నాను.

మదనకామేశ్వర లేహ్యాము




బలవర్ధకమయినది. దేహమునిక్కాక నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తిని కలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 1-12-0

రోజాపుష్ప లేహ్యాము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు మూలవ్యాధి మొదలగు వాటిని హరించి కాలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 0-14-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాట్లాగు ఉచితం.

పి. సి. ఏ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం- పెరిదేపి, నెల్లూరుజిల్లా.

"అయ్యో అదేమిటి బావా! నాగురించి నీ చదువును భావిజీవితాన్ని పాడుచేసుకుంటావా? నేను నీకు వుత్తరాలు రాస్తూ నేవుంటాను కదూ" అన్నది రాధ. హృదయారాటం కొంత శమించింది. ప్రతీవారం రాధ నాకు లేఖలు రాసేట్టు ఆమెచేత వొప్పించి రైలెక్కాను.

అనుకున్నప్రకారంగా వారానికో వుత్తరం రాధదగ్గరనుండి వస్తూండేది. ఆలేఖలలోని భావాలకి నాలో నేను వుప్పొంగిపోయేవాణ్ణి. ఆముగ్ధహృదయంలో నాకొక్కడికే స్థానం వున్నందుకు గర్వించాను. ఆమె రాసినలేఖలు, ఫోటో, రాధలేని వెలితిని నింపేశాయి. ఈప్రపంచంలో నాఅంత అదృష్టవంతుడు లేడనుకుంటే ఆనందకెరటాలు ఆకాశాన్నందుకున్నాయి.

ఒకవుత్తరంలో రాధవ్రాసింది తనకి వొంట్లో సరిగాలేదని, జ్వరంవస్తోందని, నన్నుచూడాలని వున్నదని ఆవుత్తరాన్ని చదువుకోగానే మనస్సు చాలా బాధించింది, రాధ ఆరోగ్యంకోసం వెయ్యిదేముళ్లకు మొక్కుకున్నాను. రాధ అక్కడ జ్వరంతో ఎంతబాధపడుతోందో అనుకుని నేనిక్కడ బాధపడుతున్నాను.

ఓరోజు రాధకు 'సీరియస్'గా వున్నదని, వెంటనే రావాల్సిందని 'టెలిగ్రామ్' వొచ్చింది. నా ప్రాణాలు యెగిరిపోయినట్లయ్యాయి. పిచ్చివాడిలా గదిలో తిరగసాగాను. రెక్కలుకట్టుకుని రాధ దగ్గర వాలాలనిపించింది. అతి కష్టమ్మీద 'ప్రిన్సిపాల్' దగ్గర వారంరోజులు శెలవుతీసుకున్నాను.

నేను ఇంట్లో అడుగుపెట్టేసరికి అప్పుడే డాక్టర్‌గారు పాలిపోయిన ముఖంతో 'ఇంజక్షన్ సిలిండర్' పట్టుకుని పైకివచ్చేశారు. నాగుండె కొట్టుకోవడం ఆగిపోయింది. నరాలన్నీ స్థంభించాయి. గబగబా రాధపడుకున్న గదిలోకి వెళ్ళాను.

"రాధా" అని పిల్చాను. మెల్లిగా కళ్ళు విప్పింది. మంచంమీద తనపక్క కూచోమని సంజ్ఞ చేసింది. ఆమెకు దగ్గరగా కూచున్నాను.

"బావా! నీకోసమే ఈరెండురోజులూ బతికి వున్నాను లేకపోతే మొన్ననే చనిపోవల్సింది" అన్నది.

"అలా అనకురాధా! నీవొంట్లో కులాసాగానే వుంటుంది" అన్నాను ఆమె బుగ్గలు మెల్లిగా వేళ్ళతో రాస్తూ.

"నిన్ను చూశాను. ఇంక నేనేమయిపోయినా నాకు విచారంలేదు. కానీ నాదొక్కకోరిక. తీరుస్తావా బావా?" అన్నదిరాధ.

"తప్పకుండా రాధా! నాప్రాణమిచ్చెయ్యమన్నా సిద్ధంగా నేవున్నాను" అన్నాను.

"నాకు తెలుసు బావానువ్వు అట్లాంటివాడివే నని. అందుకే, నాకోరిక నెరవేరుస్తావనే నమ్మకంతో చెబుతున్నాను. నీభార్యని నాస్మృతిచిహ్నంగా నాపేరుతో పిలువుబావా. అట్లా పిలుస్తే నా ఆత్మకి శాంతికలుగుతుంది" అన్నది.

ఆపుకోలేనంత దుఃఖం వొచ్చింది "అలాగే రాధా" అన్నాను

"హమ్మయ్య. ఇంక నాహృదయం తేలికపడ్డది" అన్నదిరాధ. ఆమె ముఖంలోకి చూస్తున్నాను పిచ్చివాడిలాగ.

"బావా! ఇలా దగ్గరగా రా" అని తనచేతులతో నన్ను దగ్గరకు తీసుకున్నది. ఆమె భావాన్ని గ్రహించి, దగ్గరగా వొంగి ఆమె పెదవులమీద తొలిసారిగా ముద్దుపెట్టుకున్నాను. నా పెదిమలకిందవున్న వెచ్చదనం చల్లగా మారిపోయింది. నాచుట్టూ వున్న ఆమెచేతులు బిగుసుకున్నాయి. ఛప్పున తలెత్తిచూశాను. ప్రశాంతంగా శాశ్వత నిద్రపోతోంది రాధ. ఆముద్దుతో ఆమెప్రాణాలను పీల్చివేశానని వలవలయేడ్చాను. రాధ...మరిలేదు!!"

సిగరెట్టు పూర్తయింది. రామం కళ్ళల్లో ముత్యాలు మెరుస్తున్నాయి. మాముందువున్న నీలిపిట్టలు ఎప్పుడు ఎగిరిపోయాయో మేం గమనించలేదు. శిరస్సుమీద చంద్రుడు సింధూరవర్ణం దాల్చాడు.